నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది
పుస్తకములు చదువు పుష్కలముగ నీవు
మరచిపోదుననుచు మదిన వలదు
పుస్తకమ్ము నీదు మస్తకమ్మునెపుడు
శుద్ధిచేసి మంచి బుద్ధి పెంచు
మీ విజయప్రసాద్
నలుమాసు తెలుగు బోధకులు,కవి

# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644

విలేకరులు కావలెను
తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్) & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్‌లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
మండల రిపోర్టర్‌లు
- క్రైమ్ రిపోర్టర్‌లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్‌లు కావలెను.
వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909.

సంచిక: 08 | సంపుటి:3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 6-7-2026 | పేజీలు: 8 | వెల: రూ.5.00


## ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగానికి..

- నలుగురి దుర్మరణం.. కారును ఢీకొట్టిన బస్సు
- విజయవాడ--హైదరాబాద్ హైవేపై ఘోర ప్రమాదం
- మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు పిల్లలు
- కూతురుకు మెరుగైన వైద్యచికిత్స కోసం చెన్నైకి..
- తిరిగివస్తుండగా చోటుచేసుకున్న ఘటన



2లో

## నేటి నుంచి మోదీ విదేశీ పర్యటన



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం నుంచి మూడు రోజులపాటు ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో పర్యటించబోతున్నారు. ఆయన తొలుత సోమవారం ఇండోనేసియాకు చేరుకుంటారు. 2016 తర్వాత మోదీ ఆ దేశానికి వెళ్తుండడం ఇదే మొదటిసారి. ఇండో--పసిఫిక్ ప్రాంతంలో భారత్, ఇండోనేసియా మరింత సన్నిహితంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

2లో

## ఖమేనీ అంత్యక్రియల్లో కీలక నేతలు



- మొజ్తబా మినహా హాజరైన ఖమేనీ ముగ్గురు కుమారులు
- 92 ఏళ్ల అయతొల్లా జాఫర్ సొభానీ సారథ్యంలో ప్రార్థనలు



# చేతకాకపోతే వారం రోజులు కేసీఆర్‌కు అప్పగించండి..

- కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు
- కాళేశ్వరం తెలంగాణకు కేసీఆర్ ఇచ్చిన వరమన్న బీఆర్ఎస్
- రూ.400 కోట్ల పనులు చేయకుండా రాజకీయం చేస్తున్నారని ఆరోపణ
- స్పందించకపోతే 50 వేల మందితో ముట్టడిస్తామని హెచ్చరిక

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాళేశ్వరం పర్యటనలో ఉద్రిక్తత నెలకొంది. హైదరాబాద్ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌కు వెళుతున్న కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతల కాన్వాయ్‌ను పోలీసులు పలుచోట్ల అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వాగ్వాదం జరిగింది. కాళేశ్వరం వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించుకుని బీఆర్ఎస్ నేతలు పంప్‌హౌస్ వైపునకు దూసుకెళ్లారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో భయం మొదలైందని, అందుకే తమ పర్యటనను అడ్డుకుంటోందని విమర్శించారు. లక్ష క్యూసెక్కుల గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి పోతుంటే, ఎగువన ఉన్న మిడ్ మానేరు, కాళేశ్వరం సహా ఏ రిజర్వాయర్‌లోనూ నీరు లేదని అన్నారు.

- మిగతా 2వ పేజీలో

# మెట్రోపై జాప్యం తగదు



- జూన్ 24 నిర్ణయాలను కేంద్రం అమలు చేయాలి
- ఎస్‌బీఐ క్యాప్స్‌కు వెంటనే బాధ్యతలు అప్పగించాలి
- కేంద్ర మంత్రులు ఖట్టర్, కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ లేఖ

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు తొలి దశ, రెండో దశ ప్రాజెక్టులకి సంబంధించి కీలకమైన నిర్ణయాల అమలులో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుండడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి ఆయన లేఖలు రాశారు. హైదరాబాద్ మెట్రో తొలి దశ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి, రెండో దశ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం అత్యంత కీలకమని ఈ లేఖల్లో ఆయన పేర్కొన్నారు. ఈ రెండు అంశాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయన్నారు. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితో గత జూన్ 24న నిర్వహించిన చర్చల్లో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలని ఆయన కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారు. మెట్రో తొలి దశ ప్రాజెక్టు విలువను అంచనా వేయడం, దాని ఆర్థికస్థితిని పరిశీలించడంతోపాటు రెండో దశ ప్రాజెక్టుకి ఆర్థిక వనరులను సమకూర్చుకునే

2లో

## కియా లాంటి మరిన్ని సక్సెస్ స్టోరీల కోసం ఎదురు చూస్తున్నాం

- సియోల్ లో తెలుగు ఎన్నారైలతో భేటీ
- భారత్‌లో దక్షిణ కొరియాకు ఏపీ నమ్మకమైన భాగస్వామి అని హామీ
- ప్రవాసాంధ్రులంతా ఏపీకి బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని పిలుపు
- స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ (3) మోడల్‌తో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని వెల్లడి




2లో

# బంగారు కుటుంబాలకు అండగా నిలుస్తున్న మార్గదర్శులు, కార్పొరేట్ సంస్థలు



- దరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమాన్ని ప్రకటించిన సీఎం చంద్రబాబు
- కుప్పం ఉద్యాన ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఐటీసీ సంస్థతో ఒప్పందం
- గంగా-కావేరి నదుల అనుసంధానం జరగాలని ఆకాంక్షించిన ముఖ్యమంత్రి
- రైతులు ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని, ఆధునిక పద్ధతులు పాటించాలని పిలుపు

పేదరిక నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యంతో కూడిన శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'పీ4' (పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ ప్రాస్పెరిటీ) కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ఒకవైపు పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేస్తూనే, మరోవైపు రైతుల ఆదాయాన్ని పెంచేలా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. తన కుప్పం పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా 'బంగారు కుటుంబాలు', 'మార్గదర్శుల'తో సమావేశమవగా, అనంతరం రైతులతో ఆత్మీయ పలకరింపులో మాట్లాడారు

- మిగతా 2వ పేజీలో

# ఉల్టా చోర్ కొత్వాల్‌కో డాంటే!

- కేటీఆర్ ధోరణి ఆ విధంగా ఉందంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫైర్
- కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణం, కూలిపోవడం వారి హయాంలోనే జరిగింది
- భద్రాచలం పట్టణం, ఆలయంతో సహా 44 గ్రామాలు కొట్టుకుపోతాయి
- మీరు ఇదే కోరుకుంటున్నారా? అంటూ నిలదీత
- బరాజ్‌లు సరిగ్గా కట్టి ఉంటే ఎల్‌నినో పరిస్థితుల్లో పనికి వచ్చేదని వ్యాఖ్య



## పోలీసు వ్యవస్థ ప్రమాదకర దిశలో పయనిస్తోంది

- చంద్రబాబు హయాంలో పోలీసు వ్యవస్థ ప్రమాదకరంగా మారిందని జగన్ విమర్శ
- రాజకీయ ప్రత్యర్థులను అణచివేసేందుకే ఈ ధోరణి అని ఆరోపణ
- నిజమైన నేరాలను వదిలేసి సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెడుతున్నారని ధ్వజం
- ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని, రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వంలో పోలీసు యంత్రాంగం అత్యంత ప్రమాదకరమైన దిశగా పయనిస్తోందని వైసీపీ అధినేత జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన 'ఎక్స్' వేదికగా చంద్రబాబు పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనను ప్రశ్నించిన వారిని, రాజకీయంగా వ్యతిరేకించే వారిని అణచివేసేందుకు చంద్రబాబు పోలీసు



2లో

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
సోమవారం 6-7-2026

## ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగానికి..

చిట్యాల: విజయవాడ--హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మధురానగర్(యూసుఫ్‌గూడ)లో నివాసముంటున్న మలిరెడ్డి వీర వెంకట నాగ వరప్రసాద్‌బాబు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో ఉద్యోగం చేస్తున్నాడు. అతడి స్వస్థలం ఏపీలోని కాకినాడ కాగా.. ఉద్యోగ రీత్యా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. వరప్రసాద్‌బాబు, అతడి భార్య విజయలక్ష్మి(40), కుమార్తె శ్రియ(17), కుమారుడు ప్రభవ్(12)తోపాటు వారికి తెలిసిన వ్యక్తి అయిన హైదరాబాద్‌లోని గుండ్లపోచంపల్లిలో నివాసముంటున్న సినీ ఎడిటర్ కట్టా శ్రీకర్ ప్రసాద్(62)తో కలిసి తమ కూతు రుకు మెరుగైన వైద్యచికిత్స కోసం శనివారం ఉదయం చెన్నై వెళ్లారు. తిరిగి శనివారం రాత్రి చెన్నై నుంచి కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో ఆదివారం తెల్లవారుజామున చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో విజయవాడ--హైదరాబాద్ హైవేపై గల యూటర్న్ వద్దకు రాగానే అతివేగంగా వస్తున్న ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు వెనుక సీట్లో కూర్చున్న విజయలక్ష్మి, శ్రియ, ప్రభవ్‌తో పాటు ముందు కూర్చున్న కట్టా శ్రీకర్ ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందారు. కారు డ్రైవింగ్ చేస్తున్న వరప్రసాద్‌బాబుకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్, తన సిబ్బందితో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వరప్రసాద్‌బాబును చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పరిశీలించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

## ఖమేనీ అంత్యక్రియల్లో కీలక నేతలు

టెహ్రాన్: దివంగత అయతొల్లా ఖమేనీ అంత్యక్రియల ప్రార్థనల్లో ఇరాన్ అగ్రనాయకులు, నూతన సుప్రీం నేత మొజ్తబా సోదరులు ఆదివారం ప్రజల ముందుకు వచ్చారు. కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఇప్పటికీ బయటకు కనిపించలేదు. అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో తండ్రి ఖమేనీ, తదితరులు చనిపోగా మొజ్తబా తీవ్రంగా గాయపడినట్లు చెబుతున్నారు. కాగా, ఖమేనీ శవపేటికను సోమవారం టెహ్రాన్‌లో ఊరేగించనున్నారు. దీనికోసం, యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేపట్టింది. నగరంలో వాహనాల రాకపోకలను, ఇతర కార్యక్రమాలను నిలిపివేసింది. అమెరికా దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యుల కోసం టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లాలో జరిగిన ప్రార్థనలకు 97 ఏళ్ల షియా మత పెద్ద అయతొల్లా జాఫర్ సొభానీ సారథ్యం వహించారు. పెద్ద సంఖ్యలో జనం హాజరైన ఈ ప్రార్థనల్లో ఖమేనీ కుమారులు మసూద్, మేసమ్, మొస్తాఫా పాల్గొన్నారు. యుద్ధం మొదలైన తర్వాత వీరు కినిపించడం ఇదే మొదటిసారి. రివల్యూషనరీ గార్డ్స్ విభాగం అధిపతి జనరల్ అహ్మద్ వాహిది సైతం వచ్చారు. నల్ల బేస్‌బాల్ టోపీ ధరించిన ఆయన చుట్టూ సాధారణ దుస్తుల్లో వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఉన్నారు. మొజ్తబాకు అత్యంత సన్నిహితుడుగా భావిస్తున్న వాహిది అమెరికాతో చర్చల్లో వ్యూహాత్మకంగా ఇరాన్ పైచేయి సాధించడం వెనుక కీలకంగా ఉన్నారని సమాచారం. వీరితోపాటు అధ్యక్షుడు పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బఘెర్ ఘాలిబాఫ్, రివల్యూషనరీ గార్డ్స్‌లోని కీలకమైన ఖుద్స్ ఫోర్స్ అధిపతి ఇస్మాయిల్ ఖానీ కూడా కనిపించారు. ప్రార్థనలకు ముందు జరిగిన ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన కవి మహ్మద్ రసౌలి అమెరికా నశించాలి!, 'ఇజ్రాయెల్ నశించాలి! అంటూ నినదించారు.

## చేతకాకపోతే వారం రోజులు కేసీఆర్‌కు అప్పగించండి..

దీంతో రైతులు విత్తనాలు కూడా వేయలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్లు ఆన్ చేస్తే తెలంగాణ మొత్తం సస్యశ్యామలం అవుతుంది. మాజీ సీఎం కేసీఆర్ ఆ విధంగా ప్రాజెక్టును డిజైన్ చేశారు. ప్రభుత్వానికి చేతకాకపోతే వారం రోజుల పాటు ప్రాజెక్టును కేసీఆర్‌కు అప్పగించండి, రైతులకు నీరందిస్తాం" అని కేటీఆర్ సవాల్ విసిరారు. రైతులకు నీళ్లిస్తే యూరియా, మద్దతు ధర, బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే సీఎం కావాలనే నీటిని వృథా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని, తమను అడ్డుకోవడం ద్వారా తన అసమర్థతను బయటపెట్టుకుంటోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీటిని వృథాగా సముద్రంలోకి వదులుతోందని ఆరోపిస్తూ, క్షేత్రస్థాయిలో పరిస్థితిని వివరించేందుకు కేటీఆర్ ఈ పర్యటన చేపట్టారు. సుమారు 40 కార్లతో కూడిన కాన్వాయ్‌ను వరంగల్ జిల్లా పెంబర్తి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఇంత పెద్ద కాన్వాయ్‌కు అనుమతి లేదని చెప్పగా, కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాసేపు వాగ్వాదం అనంతరం కాన్వాయ్ ముందుకు సాగింది.

## బంగారు కుటుంబాలకు అండగా నిలుస్తున్న మార్గదర్శులు, కార్పొరేట్ సంస్థలు

పేదల జీవితాలను బంగారు మయం చేయాలనే లక్ష్యంతోనే పీ4 విధానాన్ని అమలు చేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం కింద ఎంపిక చేసిన 'బంగారు కుటుంబాల' ఆర్థిక, సామాజిక అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ సమావేశంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మెగా, అదానీ, టీవీఎస్ మోటార్స్ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. "బంగారు కుటుంబాలు కేవలం ప్రభుత్వ సాయంపై ఆధారపడకూడదు. ఆర్థికంగా ఎదిగి ఇతరులకు సాయం చేసే స్థాయికి చేరుకోవాలి. ఇందుకోసం మార్గదర్శులు, బంగారు మిత్రలు ప్రతి కుటుంబాన్ని అధ్యయనం చేసి, వారి అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలి," అని సీఎం సూచించారు. సమాజంలోని ఉన్నత వర్గాల్లోని 10 శాతం మంది, పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలకు అండగా నిలవాలనే 'ఎంబీకే--10:20' నమూనాతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 12 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించగా, వారికి చేయూతనివ్వడానికి 1.10 లక్షల మంది మార్గదర్శులు ముందుకు రావడం శుభపరిణామమని అన్నారు.

# ఉల్టా చోర్ కొత్వాల్‌కో డాంటే!

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల డిజైన్ల తయారీ, నిర్మాణం, కూలిపోవడం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని, బరాజ్‌ల వైఫల్యానికి నాటి సీఎం, ఇరిగేషన్, ఆర్థిక శాఖల మంత్రులే బాధ్యులని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ తేల్చిందని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డిజైన్లు, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలతోనే బరాజ్‌లు విఫలమయ్యాయని, సీకెంట్ పైల్స్, స్టిల్లింగ్ బేసిన్‌ల నిర్మాణంలో తప్పిదాలే ప్రధాన కారణమని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) కమిటీ నివేదించిందని చెప్పారు. అయినప్పటికీ 'ఉల్టా చోర్ కొత్వాల్‌కో డాంటే' అన్న తరహాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధోరణి ఉందని మంత్రి మండిపడ్డారు. బరాజ్‌ల భద్రత ప్రమాదంలో ఉందని, నీళ్లను నిల్వ చేయరాదని ఎన్డీఎస్ఏ కమిటీ హెచ్చరించిందని గుర్తు చేశారు. ఒకవేళ నీళ్లను నిల్వ చేస్తే దిగువన ఉన్న భద్రాచలం పట్టణం, ఆలయంతో సహా 44 గ్రామాలు కొట్టుకుపోతాయని తెలిపారు. 'మీరు ఇదే కోరుకుంటున్నారా?' అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. కేటీఆర్ కంటే ఎన్డీఎస్ఏ నిపుణులకు కొద్దిగా జ్ఞానం ఎక్కువ ఉందని భావించి బరాజ్‌లలో నీళ్లను నిల్వ చేయడం లేదని ఎద్దేవా చేశారు. కేటీఆర్ కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శన నేపథ్యంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును సరిగ్గా కట్టి ఉంటే ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో రాష్ట్రానికి ఇంత దురదృష్టకరమైన దుస్థితి ఉండేది కాదు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి కాళేశ్వరం ప్రాజెక్టును ఇష్టమొచి?చనట్లు నిర్మించారు. కాళేశ్వరం చేపట్టకుండా రూ.38,500 కోట్లతో ప్రాణహిత--చేవెళ్లను పూర్తి చేసి ఉంటే ఎల్‌నినో పరిస్థితుల్లో సైతం తెలంగాణ సస్యశామలమయ్యేది. బీఆర్ఎస్ పాలకుల ఘోర తప్పిదంతోనే మూడు బరాజ్‌లు పనికి రాకుండా పోయాయి. ఎన్డీఎస్ఏ, విజిలెన్స్, జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికలూ ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ లొకేషన్ మార్చి రాష్ట్రానికి ద్రోహం చేశారు. నిర్మాణం పూర్తైన కొన్ని రోజులకే మూడు బరాజ్‌లలో లోపాలు, సీపేజీలు బయపడ్డాయి. అయినా మరమ్మతులు చేయకుండా గత సర్కారు నిర్లక్ష్యం చేసింది. మరమ్మతుల కోసం బరాజ్‌లలో నీళ్లను ఖాళీ చేసేందుకు గత ప్రభుత్వ పెద్దలు అనుమతించలేదు. అంతేకాదు..పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేశారు. వ్యవస్థ కుప్పకూలిపోయింది. బీఆర్ఎస్ వాళ్లు ఏది ముడితే అది నాశనమైంది. మన పిల్లలు, వారి పిల్లల భవిష్యత్తును తాకట్టుపెట్టి అధిక వడ్డీలతో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం అప్పులు తెచ్చారు. దేశంలో మరే రాష్ట్రం చేయనంతగా రూ.1.81 లక్షల కోట్లను కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి, సీతారామ వంటి ప్రాజెక్టులపై ఖర్చు పెట్టి ఎకరం కూడా కొత్త ఆయకట్టును సాగులోకి తీసుకురాలేదు..' అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లకు పరీక్షలు, మరమ్మతులను పూర్తి చేసి 2027 జూలై/ఆగస్టు నాటికి పూర్తి స్థాయిలో పునరుద్ధరించి వినియోగంలోకి తెస్తాం. మూడు బరాజ్‌లకు రక్షణగా డయాఫ్రమ్ వాల్ నిర్మాణంతో పాటు స్టిల్లింగ్ బేసిన్ సామర్థ్యం పెంచాల్సి ఉంటుందని అంచనా వేశాం. నెల రోజుల్లో బరాజ్‌ల పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేసి పనులను ప్రారంభిస్తాం..' అని మంత్రి తెలిపారు. కాగా బరాజ్‌లకు గేట్లను దింపితేనే నీళ్లను పంపింగ్ చేయడానికి వీలుంటుందని, ప్రస్తుతం గేట్లు దింపే పరిస్థితి లేదని నీటిపారుదల శాఖ సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. నీటిపారుదల శాఖ సలహాదారులతో కలిసి ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బరాజ్‌ల పునరుద్ధరణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎన్డీఎస్ఏ సూచించిన అన్ని రకాల టెస్టులను పకడ్బందీగా నిర్వహిస్తుండడంతోనే పునరుద్ధరణలో జాప్యం జరుగుతోందని చెప్పారు. సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, సౌరంగాల నిపుణులు కల్నల్ పరీక్షిత్ మెహ్రా పాల్గొన్నారు.

## పోలీసు వ్యవస్థ ప్రమాదకర దిశలో పయనిస్తోంది

వ్యవస్థను ఒక సాధనంగా మార్చుకుంటున్నారని, ఇది రాష్ట్రాన్ని పెను ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపించారు. "చంద్రబాబు గారూ... రాష్ట్రానికి కావాల్సింది 'రౌడీ పోలీసింగ్' కానీ, 'జంగిల్ రాజ్' కానీ కాదు. ప్రజలకు భద్రత కల్పించే పరిపాలన, బాధితులకు న్యాయం చేసే వ్యవస్థ, చట్టం ముందు అందరూ సమానమే అని విశ్వసించే సమాజం కావాలి. రాజకీయ ఆదేశాలతో కాకుండా రాజ్యాంగబద్ధంగా పనిచేసే పోలీసు వ్యవస్థ మనకు అవసరం" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. చంద్రబాబు తన దుర్మార్గపు పాలనతో రాష్ట్రవ్యాప్తంగా విష బీజాలు నాటారని, అవి క్రమంగా మొలకెత్తి విష వృక్షాలుగా మారుతున్నాయని జగన్ అభివర్ణించారు. పోలీసుల పనితీరును ప్రశ్నిస్తూ జగన్ పలు ఘటనలను ఉదహరించారు. "పిల్లలు కనపించకుండా పోతే దర్యాప్తులో వేగం ఉండదు. మహిళలపై నేరాలకు సంబంధించి ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం. గిరిజన మహిళను వివస్త్రను చేసి కొట్టినా అరెస్టులు జరగవు. కానీ, సోషల్ మీడియాలో మిమ్మల్ని ప్రశ్నిస్తే మాత్రం కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం, చిత్రహింసలకు గురిచేయడం, నాన్-బెయిలబుల్ సెక్షన్లు ప్రయోగించడం వంటివి చేస్తారా?" అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో నెల రోజుల క్రితం అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కేసు, పెద్దాపురంలో మానసిక వికలాంగురాలిపై జరిగిన లైంగిక దాడి కేసు నమోదులో జాప్యం, నెల్లూరు జిల్లాలో మాజీ టీడీపీ కౌన్సిలర్ ఒక గిరిజన మహిళను వివస్త్రను చేసి దాడి చేసిన ఘటనను ఆయన ప్రస్తావించారు. సాయి కృష్ణ కస్టడీ మరణం, అతని మృతదేహం అదృశ్యం కావడం రాష్ట్రాన్ని కుదుపునకు గురిచేసిందని, అతని తల్లి అడిగే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదని అన్నారు. కాంతి కుమార్ ఆత్మహత్య, అతను ఇచ్చిన మరణ వాంగ్మూలం, దాన్ని ప్రజలు సోషల్ మీడియాలో ప్రత్యక్షంగా చూడటం తీవ్రంగా కలచివేసిందన్నారు. గంగమ్మ, తిరుపతమ్మ కస్టడీ మరణాలు, పోలీసు వేధింపుల కారణంగా కళావతి ఆత్మహత్య చేసుకోవడం వంటి ఘటనలు రాష్ట్ర పోలీసు వ్యవస్థకు తీవ్ర అప్రతిష్టను తెచ్చిపెట్టాయని, అయినా మీ తీరు మారడం లేదని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబు ఈ పంథాను ఎంచుకున్నారని జగన్ ఆరోపించారు. సాధారణ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయకుండా, ప్రతి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ఆదేశించి సోషల్ మీడియా కార్యకర్తలపై నాన్-బెయిలబుల్ సెక్షన్లు పెట్టించి, వారి కేసులను వ్యవస్థీకృత నేరాలతో ముడిపెడుతున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి అని హెచ్చరించారు. "ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వారిని భయపెట్టాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమే అవుతుంది" అని జగన్ తెలిపారు. యూట్యూబర్, జర్నలిజంలో ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ అయిన కేవీఆర్‌ను ఎలాంటి చట్టపరమైన ప్రక్రియలు పాటించకుండా భారీ పోలీసు బలగంతో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి, అతను చేయని నేరాలకు ఎఫ్ఐఆర్‌లో ఇరికించి జైల్లో పెట్టడం అత్యంత దారుణమని జగన్ ఖండించారు.

## మెట్రోపై జాప్యం తగదు

మార్గాలను అన్వేషించే బాధ్యతలను ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్(ఎస్‌బీఐ క్యాప్స్) సంస్థకు బాధ్యతలను అప్పగించాలని ఆ సమావేశంలో నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నిర్ణయం జరిగి చాలా రోజులు గడిచినా, ఇప్పటి వరకు ఎస్‌బీఐ క్యాప్స్‌కు బాధ్యతలు అప్పగించలేదని, అలాగే ఈ ప్రక్రియకు సంబంధించిన నియమనిబంధనలు సైతం ఖరారు చేయలేదని ప్రస్తావించారు. ఈ జాప్యంతో మెట్రో రైలు తొలి దశ ప్రాజెక్టు నిర్వహణలో అనిశ్చితి నెలకొనడమే కాకుండా, రెండో దశ నిర్మాణంలో ఆలస్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనితో ప్రాజెక్టు వ్యయం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్‌కు బాధ్యతలను తక్షణమే అప్పగించేలా చూడాలని, తద్వారా మెట్రో విస్తరణ పనులు వేగంగా ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్రం చర్యలు తీసుకునేలా మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని సూచించారు. మజ్లిస్‌ను బుజ్జగిస్తున్న రేవంత్ ప్రభుత్వం

## నేటి నుంచి మోదీ విదేశీ పర్యటన

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం నుంచి మూడు రోజులపాటు ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో పర్యటించబోతున్నారు. ఆయన తొలుత సోమవారం ఇండోనేసియాకు చేరుకుంటారు. 2016 తర్వాత మోదీ ఆ దేశానికి వెళ్తుండడం ఇదే మొదటిసారి. ఇండో--పసిఫిక్ ప్రాంతంలో భారత్, ఇండోనేసియా మరింత సన్నిహితంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, సముద్ర భద్రతపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంటోతో మోదీ సమావేశమవుతారు. ఇరుదేశాల సంబంధాలు, ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తారు. ఇండో--పసిఫిక్‌లో సము ద్ర సహకారాన్ని, సరఫరా గొలుసులను పటిష్టం చేయడం, ఆర్థిక మరియు వ్యూహాత్మక సంబంధాలు, కీలక ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం, తయారీ రంగంలో సహకారం, వాణిజ్యాన్ని ప్రోత్సహించడం, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలపై చర్చించే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని వారు సమీక్షిస్తారు. రాజధాని జకార్తాలో ప్రవాస భారతీయులతోనూ మోదీ భేటీ అవుతారు. వారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఇండోనేసియాలోని ప్రఖ్యాత ప్రాంబనన్ ఆలయాన్ని మోదీ దర్శించుకుంటారు. మోదీ ఇండోనేసియా పర్యటన ముగించుకున్న తర్వాత వెంటనే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించబోతున్నారు. ఇండోనేసియా ప్రస్తుత అధ్యక్షుడు సుబియాంటో గత సంవత్సరం భారత్‌లో పర్యటించారు. ఢిల్లీలో గణతంత్ర దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

# కియా లాంటి మరిన్ని సక్సెస్ స్టోరీల కోసం ఎదురు చూస్తున్నాం

ఆంధ్రప్రదేశ్‌లో కియా మోటార్స్ సాధించిన విజయం ఒక ఆదర్శమని, అలాంటి మరిన్ని విజయగాథలను సృష్టించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఏపీ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఐటీ, సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఏ రంగంలోనైనా కలిసి పనిచేసేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని, భారత్‌లో దక్షిణ కొరియాకు అత్యంత నమ్మకమైన భాగస్వామిగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. తన కొరియా పర్యటనలో భాగంగా ఆదివారం సియోల్‌లో జరిగిన తెలుగు డయాస్పోరా సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "కియా తమ ఫ్యాక్టరీ కోసం స్థలాన్ని అన్వేషిస్తున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే స్పందించి, పారదర్శక విధానాలతో వేగవంతమైన అనుమతులు ఇచ్చి నిజమైన భాగస్వామిగా నిలిచింది. ఫలితంగా ఏర్పాటైన కియా ప్లాంట్, కేవలం కార్ల తయారీ కేంద్రంగానే కాకుండా, వేలాది మందికి ఉపాధి కల్పించే ఒక పూర్తిస్థాయి ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌గా అభివృద్ధి చెందింది. ఈ ప్రయాణాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని విజయాలు సాధించాలి" అని



అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలోకి ప్రవేశించిందని లోకేశ్ వివరించారు. "ప్రస్తుతం ప్రపంచ పెట్టుబడిదారులు కోరుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలు (స్పీడ్), పాలనా స్థిరత్వం (స్టెబిలిటీ), పెట్టుబడి తర్వాత నాణ్యమైన సేవలు (సర్వీస్) అనే 3ఎ మోడల్‌ను ఏపీ అనుసరిస్తోంది. ఈ ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ విధానాలతో రాష్ట్రం పెట్టుబడిదారులకు నమ్మకమైన గమ్యస్థానంగా మారింది" అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులు ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్లని లోకేశ్ అభివర్ణించారు. "మీరు వెళ్లే ప్రతిచోట ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గాథను చెప్పండి. మా రాష్ట్రంలోని అవకాశాలు, వేగవంతమైన అనుమతులు, పారదర్శక పాలన గురించి వివరించి పెట్టుబడులు పెట్టాలని కోరండి" అని ఆయన పిలుపునిచ్చారు. దక్షిణ కొరియా అభివృద్ధి ప్రయాణం స్ఫూర్తిదాయకమని, శ్రమ, ఆవిష్కరణలతోనే దేశాలు అభివృద్ధి చెందుతాయని కొరియా నిరూపించిందని కొనియాడారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తెస్తున్నామని, తద్వారా విద్యార్థులు ప్రపంచస్థాయి ఉద్యోగాలకు సిద్ధమవుతారని లోకేశ్ తెలిపారు. "బలమైన రాష్ట్రాలే బలమైన భారత్‌ను నిర్మిస్తాయని మేము బలంగా నమ్ముతాం. ప్రాంతీయ ఆకాంక్షలు, జాతీయ అభివృద్ధి ప్రణాళికలు కలిస్తేనే విజయం సాధ్యం" అని ఆయన అన్నారు. ఏపీఎన్ఆర్టీ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాల పండుగ వేడుకలు





**ఖానాపూర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని సింగపూర్ పెద్దమ్మ ఆలయంలో ఆదివారం ఘనంగా పండుగ కార్యక్రమాలు జరిగాయి.నిర్మల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు రితిష్ రాథోడ్ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.పండుగ సందర్భంగా మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలు తీశారు. పోతరాజుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు రాకతో దేవస్థాన కమిటీ అన్ని ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసింది.

## వివో భవన నిర్మాణానికి భూమి పూజ



**ఖానాపూర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని గోడలు పంపు గ్రామంలో ఆదివారం విలేజ్ ఆర్గనైజేషన్ నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ పంబాల నాగవ్వ భూమి పూజ చేశారు.తరువాత వర్క్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి ఈ భవనాలు ఎంతో ఉపయోగకరమని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘంటసాల గంగాధర్‌కు హిందూ ఉత్సవ సమితి సమక్షంలో ఘన నివాళి





**ఖానాపూర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఘంటసాల శ్యామల గంగాధర్ గుండెపోటుతో అకాల మరణం చెందడంతో ఆయన సేవలను స్మరించుకుంటూ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి కార్యక్రమం జరిగింది.గంగాధర్ ప్రతి హిందూ ధార్మిక కార్యక్రమాల్లో ముందుండి సేవలందించారని, గణేష్ నిమజ్జనం, బతుకమ్మ, దసరా వంటి వేడుకల్లో తన వాగ్దాటి, పాటలతో అందర్నీ ఆకట్టుకున్నారని నాయకులు గుర్తుచేశారు. ఆయన లేని లోటు తీరనిదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్ర రాజ్యం సురేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ మోహన్‌రావు, శ్రీనివాస్, జోగు రాజేశ్వర్, బీసీ రమేష్, శేఖర్ పడాల, మహేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

## ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**ఖానాపూర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ ఉన్నత పాఠశాలలో 1991--92లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఏఎంకే ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.దాదాపు 250 మంది విద్యార్థులు 34 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని జ్ఞాపకాలను పంచుకున్నారు. ఉపాధ్యాయులు ఆర్. విట్టల్, స్వామిని పాదాభివందనంతో ఘనంగా సన్మానించారు.సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# గ్రామీణ సాధికారత-ప్రపంచ ప్రభావం






జూలై 6 ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం గ్రామీణ సాధికారత -- ప్రపంచ ప్రభావం అనే నినాదాన్ని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లేకుండా ప్రపంచ స్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదనే స్పష్టమైన సందేశాన్ని ఈ నినాదం అందిస్తోంది. ప్రపంచ జనాభాలో సగం మంది గ్రామాల్లో నివసిస్తుండగా, అత్యంత పేదలలో 80 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. వ్యవసాయం, పశు సంవర్ధక, మత్స్య, అటవీ రంగాలు గ్రామాలపై ఆధారపడి ఉంటాయి. అయినప్పటికీ విద్య, వైద్యం, తాగునీరు, రవాణా, ఉపాధి వంటి ప్రాథమిక సౌకర్యాల విషయంలో గ్రామాలు వెనుకబడి ఉన్నాయి. ఈ అసమానతలను తొలగించడమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. మహిళలు, యువతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిస్తోంది. మహిళలకు భూమిపై హక్కులు, రుణాలు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలు కల్పించడం, యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, డిజిటల్ విద్య అందించడం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుంది. భారతదేశానికి ఈ దినోత్సవం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగింది. జనాభాలో అధిక శాతం గ్రామాల్లో నివసిస్తూ వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. రైతుల ఆదాయ పెంపు, గ్రామీణ పారిశ్రామికీకరణ, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, డిజిటల్ సేవల విస్తరణ వంటి చర్యలు దేశ అభివృద్ధికి కీలకం.తెలంగాణ రాష్ట్రంలో కూడా గ్రామీణాభివృద్ధి అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం. రైతుల సంక్షేమం, మౌలిక వసతుల విస్తరణ, మహిళా సంఘాల బలోపేతం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో ఈ దినోత్సవం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామాల అభివృద్ధికి దోహదపడుతున్నాయి. ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం ఒక వేడుక మాత్రమే కాదు, గ్రామీణ ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావాలనే సంకల్పానికి ప్రతీక. ప్రతి గ్రామం బలపడితేనే దేశం బలపడుతుంది. ప్రతి రైతు బలోపేతం అయితేనే ప్రపంచ ఆహార భద్రత బలపడుతుంది. గ్రామీణ సాధికారత -- ప్రపంచ ప్రభావం అనే నినాదం గ్రామాల అభివృద్ధే ప్రపంచ భవిష్యత్తుకు పునాది అని మరోసారి గుర్తు చేస్తోంది.

**వ్యాసకర్త**

**వేల్పుల మహేందర్, ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంఈడి**

**అధ్యాపకులు**

## ఉపముఖ్యమంత్రిని కలిసిన దేవరకొండ ఎమ్మెల్యే



**దేవరకొండ, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ ప్రజా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్కను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన దేవరకొండ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా సమస్యలు, మౌలిక సదుపాయాల బలోపేతం, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ పనులు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్ల విస్తరణ వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని, దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలు నాయక్ స్పష్టం చేశారు.

## ఓటరు జాబితా సవరణ పరిశీలన



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓటరు జాబితా సవరణ ప్రక్రియను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు స్వయంగా పరిశీలించారు.బూత్ లెవెల్ అధికారులు చేపడుతున్న ఫారాల పంపిణీ, సేకరణను పర్యవేక్షించిన ఆయన, ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరుకు ఫారాలు చేరేలా చూడాలని సూచించారు. పూర్తిచేసిన ఫారాలను తప్పనిసరిగా సేకరించి, ఏ ఒక్క ఓటరికి ఇబ్బంది కలగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.సర్వే పారదర్శకంగా, పకడ్బందీగా జరగాలని, ప్రజలకు అసౌకర్యం లేకుండా అధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించాలని ఆయన స్పష్టం చేశారు.

## ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన మేయర్



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ 2వ డివిజన్ తీగలగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సహకారంతో, మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో ఆధునిక పరికరాలతో ఈ జిమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కోసం ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని మేయర్ సూచించారు.రాబోయే రోజుల్లో నగరంలోని మరిన్ని డివిజన్లలో ఇలాంటి మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా అంకం రాజేందర్ నియామకం



**ఖానాపూర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో శాంతినగర్ పంత ఎన్నికలు నిర్వహించారు. సభ్యులు ఏకగ్రీవంగా అంకం రాజేందర్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శెట్టి పెల్లి దత్తాద్రి, కోశాధికారిగా అంక మహేందర్, ఉపాధ్యక్షులుగా అంకం శంకర్, బైరి శ్రీనివాస్, ఆడేపు శంకర్, బొప్పారపు రాజేశ్వర్, సంయుక్త కార్యదర్శులుగా నల్ల రమేష్, రాం బీమాలింగు గారిని ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా భోగా లక్ష్మణ్, దాసరి నారాయణ, రాం భీమేశ్వర్, బైరి చంద్రశేఖర్, ఆడేపు గణేష్, అంకం లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడిగా రాం రాజన్నను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మొగిలి, అంకం నరహరి, దాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభించిన డాక్టర్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో వీఎన్ఆర్ బ్యాడ్మింటన్ కప్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని, ఒత్తిడి నుండి ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు. యువత క్రీడల పట్ల దృష్టి సారించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు.ప్రపంచ బ్యాడ్మింటన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి గుంటపల్లి స్వామి, బాబు శంకర్, రాజిరెడ్డి, శంకర్ రావు, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, నరేష్, క్రాంతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా గంగుల రాకేష్ నియామకం



**పెద్దపల్లి, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చందపల్లి గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా గంగుల రాకేష్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో సభ్యులు, పెద్దల సమక్షంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గంగుల రాకేష్ మాట్లాడుతూ, సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, యువత ప్రోత్సాహం, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు. సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యతే మన బలం, అభివృద్ధే మన లక్ష్యం అనే నినాదంతో సంఘాన్ని బలోపేతం చేయాలని సభ్యులు పిలుపునిచ్చారు.

## కన్నెపల్లి పంప్ హౌస్ వైపు కేటీఆర్ పర్యటన



**పెద్దపల్లి, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పెద్దపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు, కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటనకు బయలుదేరారు. హైదరాబాద్--వరంగల్ హైవేపై పెంబర్తి వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు వాటిని బద్దలు కొట్టి ముందుకు సాగారు. అనంతరం కేటీఆర్ బృందం కన్నెపల్లి పంప్ హౌస్ వైపు దూసుకెళ్లింది. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రూరల్ మండలంలోని రజ్వీ చమన్ సమీపంలో రోడ్డు దాటుతున్న మునావర్ హుస్సేన్ (59), మక్బూల్ హుస్సేన్ (60)లను అతివేగంగా వచ్చిన మోటార్‌సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. మునావర్ హుస్సేన్ కరీంనగర్ భద్రకాళి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తలకు తీవ్ర గాయాల కారణంగా మృతి చెందాడు. మక్బూల్ హుస్సేన్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి కుమారుడు కబీర్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు కరీం పాషాను పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## ఘనంగా రైతు సంబరాలు



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతు భరోసా నిధుల విడుదలను పురస్కరించుకొని కరీంనగర్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా రైతు సంబరాలు నిర్వహించారు. జూలై 4 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 67.44 లక్షల మంది రైతులకు 1.18 కోట్ల ఎకరాలకు రూ.7,135.77 కోట్ల రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా కరీంనగర్ కార్పొరేషన్ 6వ డివిజన్ బొమ్మకల్, రూరల్ మండలం చామనపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్పొరేటర్, కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, రైతు భరోసా ద్వారా లక్షలాది రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. గతంలో యూపీఏ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసినట్లు, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీతో పాటు ఉచిత కరెంటు, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాలతో రైతులకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

# విరసం సభలను అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్య

**- సీపీఐ(ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ**




**నల్లగొండ, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విప్లవ రచయితల సంఘం (విరసం) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరగాల్సిన "ఫాసిజం" సదస్సును పోలీసులు అడ్డుకోవడాన్ని సీపీఐ(ఎం-ఎల్) న్యూ డెమొక్రసీ తీవ్రంగా ఖండించింది. జిల్లా కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య పునరుద్ధరణ పేరుతో గొంతుకలను అణచివేస్తోందని విమర్శించారు. సమావేశం నిర్వహించుకునే హక్కును నిరాకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 19కి విరుద్ధమని పేర్కొన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఫాసిస్ట్ విధానాలను వేగవంతం చేస్తూ ప్రజల ఆస్తులను కార్పొరేట్‌కు దోచిపెడుతోందని, మేధావులను రాజద్రోహం పేరుతో జైళ్లలో నిర్బంధిస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ కూడా ఈ విధానాలను అనుసరిస్తే భవిష్యత్‌లో పతనానికి కారణమవుతుందని హెచ్చరించారు.

# నిరంకుశ పాలన నడుస్తుందంటూ బిఆర్ఎస్ ఆరోపణలు

**ఎలిగేడు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలన నడిపిస్తోందని ఎలిగేడు మండలంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన కన్నెపల్లి పంప్ హౌస్ పనులను ప్రారంభించాలనే డిమాండ్‌తో ఆదివారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పంప్ హౌస్‌ను సందర్శించనున్న నేపథ్యంలో, ఎలిగేడు మండల పరిధిలోని బిఆర్ఎస్ నాయకులు అక్కడికి వెళ్లారు. అయితే కొయ్యూరు సమీపంలో పోలీసులు వాహనాలను అడ్డుకొని, బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను కొయ్యూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలని పలువురు బిఆర్ఎస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. అరెస్టైన వారిలో న్యాతరి పోచాలు, బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి వినోద్, రాజ కొమురయ్య, పూర్ణచందర్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారని సమాచారం.



## సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకాలు







**మానకొండూర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానకొండూర్ నియోజకవర్గంలో రహదారి పనుల కోసం రూ.58 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం అన్ని మండలాల్లో మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా హైబ్రిడ్ ఆన్యుటీ మోడల్ (హామ్) విధానంలో రోడ్ల నిర్మాణాలకు రూ.11,540 కోట్లు మంజూరవగా, మానకొండూర్ పరిధిలోని ఆరు మండలాల్లో 75.67 కిలోమీటర్ల వరకు 19 రోడ్డు పనులకు రూ.58.29 కోట్లు కేటాయించారు. మానకొండూర్ మండల కేంద్రంలో, గన్నేరువరం గోపాలపూర్, పారువెల్ల గ్రామాల్లో, బెజ్జంకి అంబేద్కర్ చౌరస్తాలో, తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ ఎదుట కాంగ్రెస్ నాయకులు సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సీతక్క పేదలు, గిరిజనులు, మహిళల అభ్యున్నతికి కృషి చేస్తూ మానకొండూర్‌పై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి వినతికి అనుగుణంగా భారీ నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనున్నదని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రెండో డివిజన్ తీగలగుట్టపల్లి సరస్వతి నగర్ రోడ్ నెం.5లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భాస్కర్ నాయక్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు






**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రూరల్ మండలంలో పోలీసులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టివేశారు. గోపాల్పూర్ ఎక్స్‌రోడ్ వద్ద ఒక ట్రాక్టర్‌ను, శమీర్ దాబా వద్ద మరో ట్రాక్టర్‌ను పోలీసులు పెట్రోలింగ్ సమయంలో ఆపి తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నట్లు బయటపడడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి, డ్రైవర్లు, ఓనర్లను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. ఇకపై అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యురాలిగా డా. శ్రీవాణి నియామకం

**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగాధిపతి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. శ్రీవాణిని ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ కార్యనిర్వాహక మండలి సభ్యురాలిగా నియమించారు. 2025 డిసెంబర్‌లో చెన్నైలో జరిగిన ఐఈఏ 108వ వార్షిక జాతీయ సమావేశంలో జరిగిన ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం నుండి ఆమెను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు అసోసియేషన్ న్యూస్‌లెటర్‌లో వెల్లడైంది. రాబోయే మూడు సంవత్సరాల పాటు అసోసియేషన్ తరఫున సదస్సులు, సమావేశాలు నిర్వహించనున్నారు. 1917లో స్థాపించబడిన ఐఈఏ భారతదేశంలో అతి పురాతన, ప్రముఖ ఆర్థిక సంఘం. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ఆర్బీఐ మాజీ గవర్నర్ రంగరాజన్, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ ఈ సంఘానికి అధ్యక్షులుగా పనిచేశారు. డా. శ్రీవాణి నియామకంపై శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్ అభినందనలు తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు శ్రీవాణికి శుభాకాంక్షలు తెలిపారు.



నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
సోమవారం 6-7-2026

## బీఆర్ఎస్ నాయకుల అరెస్టులు



**సుల్తానాబాద్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాళేశ్వరం ప్రాజెక్టు కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శనకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనకు ముందుగా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. మండల కన్వీనర్ బోయిని రాజ మల్లయ్య, టౌన్ ప్రెసిడెంట్ పారుపల్లి గుణపతి, మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్, యూత్ వైస్ ప్రెసిడెంట్ గాజుల అరుణ్ కుమార్‌తో పాటు మరికొందరిని పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేమని తీవ్రంగా విమర్శించాయి.

## ఈనెల 14న ప్రారంభంకానున్న శాకాంభరీ ఉత్సవాలు



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా జూలై 14 నుండి 29 వరకు శాకాంభరీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్ తెలిపారు. 14న అమావాస్య సందర్భంగా ఫలపంచామృతాభిషేకం, విశేష పూజలు, ధ్వజారోహణం జరుగుతాయి. ఉత్సవాల్లో రోజుకోక్క కూరగాయల మాలతో అమ్మవారిని అలంకరించనున్నారు. 23న చండీహోమం, మహాపూర్ణహుతి, 29న పౌర్ణమి సందర్భంగా అన్ని రకాల కూరగాయల మాలలతో అమ్మవారు దర్శనమిస్తారు. అదే రోజు వ్యాసపూజ, పల్లకిసేవ, సహస్రదీపాలంకరణ, ఉయ్యాల సేవ వంటి విశేష కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు అమ్మవారికి మంగళహారతి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## మురికినీరు డ్రైనేజీ పరిశీలన



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు బతుకమ్మ సావుల దగ్గర మురికినీరు డ్రైనేజీ పరిస్థితిని పరిశీలించారు. వర్షాకాలం కారణంగా సమస్యను త్వరగా పరిష్కరించాలని స్థానిక కౌన్సిలర్ ప్రజల తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సునీత, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భార్య వేదింపులకు భర్త ఆత్మహత్య



**కరీంనగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రూరల్ మండలంలోని తిగగుట్టపల్లి సరస్వతి నగర్‌లో భార్య వేదింపులను తట్టుకోలేక కళ్యాణం రాకేష్ (27) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంచలనంగా మారింది. హైదరాబాద్‌కు చెందిన సంజనా అలియాస్ వర్షతో ప్రేమించి పెళ్లి చేసుకున్న రాకేష్, గత కొంతకాలంగా భార్య మానసికంగా వేధింపులకు గురి చేసినట్లు మృతుడి తండ్రి కళ్యాణం రవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులను కలవకుండా, వారితో మాట్లాడకుండా అడ్డుకోవడంతో పాటు బంగారం ఆభరణాలు తేవాలని ఒత్తిడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వేధింపులను తట్టుకోలేక రాకేష్ తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫిర్యాదు ఆధారంగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 243/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి

**- చల్లా వంశీచంద్ రెడ్డి**



**ఆమనగల్లు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని ఏఐసీసీ సీడబ్ల్యూసీ ముఖ్య ఆహ్వానితులు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. ఆదివారం కందుకూరు మండలం తాడిపత్రిలో ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులతో సమావేశమైన చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్నారు. ప్రతి నాయకుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య, సేట్ అజీమ్, సీనియర్ నాయకురాలు సునంద, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, తలకొండపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నకేశవులు, కడ్తాల్ మండల మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, మైనారిటీ అధ్యక్షుడు ఇక్బాల్ పాషా, టీకేపీ యూత్ కాంగ్రెస్ నాయకుడు జూలపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాల ద్వారానే పేద ప్రజల సమస్యలు పరిష్కారం

**ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**




**మర్రిగూడ, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలం కుదబాక్షపల్లిలో సిపిఐ గ్రామ శాఖ సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ పేదల హక్కులను హరించడమే కాకుండా, యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను విస్మరించాయని ఆయన విమర్శించారు. యూరియా యాప్ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని, దాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షం రెడ్డి, మండల కన్వీనర్ బుర్ర శేఖర్, గ్రామ శాఖ సభ్యులు మేదరి యాదయ్య, విస్కీల మహేందర్, పున్నం లక్ష్మయ్య, విరజాల మహేందర్, యాట గిరి, పొట్ట అశోకు, తానేదారుపల్లి ఈశ్వర్, అయితేగొని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు :రితీష్ రాథోడ్



**ఖానాపూర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ అధ్యక్షుడు రితీష్ రాథోడ్ విమర్శించారు. ఖానాపూర్‌లో బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎలాంటి సమస్యలు లేకుండా యూరియా సరఫరా జరిగేదని, ఇప్పుడు యాప్ కారణంగా రైతులు ఎరువులు కొనలేకపోతున్నారని అన్నారు. నెట్వర్క్ సమస్యలు, మొబైల్ ఫోన్ల లేమి, సరైన అవగాహన లేకపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం యాప్ విధానాన్ని తొలగించి పాత పద్ధతినే ప్రవేశపెట్టాలని, రైతుల పట్టాదారు పుస్తకాల ఆధారంగా ఎరువులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్, కౌన్సిలర్లు బొప్పారం సత్యవతి, మహేందర్, బీజేపీ నాయకులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి చౌరస్తాలో ఆటో స్టాండ్స్ ఏర్పాటు చేయాలి:మున్నూరు కృష్ణ




**కల్వకుర్తి, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన తెలంగాణ ఆటో డ్రైవర్స్ మోటార్స్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మున్నూరు కృష్ణ మాట్లాడుతూ, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆటో కార్మికునికి 12 వేల రూపాయలు అందించాలని కోరారు. ఆర్టీవో, పోలీసుల వేధింపులను అరికట్టాలని, ప్రతి చౌరస్తాలో ఆటో స్టాండ్స్ ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు మీది దొడ్డి నరసింహ, మంచాల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, పరశురాములు, ఆటో డ్రైవర్స్ దేశం సైదులు, రాజేష్, శివ, రాములు, అమీర్ పాల్గొన్నారు.

## షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు వినతిపత్రం




**షాద్‌నగర్, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా విస్తరణ పనులను అత్యవసరంగా చేపట్టాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఆర్.ఎన్. రాము ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిలకు వినతిపత్రం అందజేశారు. ఆర్.ఎన్. రాము మాట్లాడుతూ, రోజురోజుకు వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు జరుగుతున్నాయని, చౌరస్తా విస్తరణ ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పాత జాతీయ రహదారి కూడలిని విస్తరించడం ద్వారా ప్రజలకు రక్షణ కల్పించవచ్చని వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రి వాకిటి శ్రీహరి సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## అర్హుల వివరాల నమోదు తప్పనిసరి



**ఎలిగేడు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఎలిగేడు గ్రామ ఉపసర్పంచ్ ముంజం నరేష్ సూచించారు. ఆదివారం గ్రామంలో బీఎల్వోలు నిర్వహిస్తున్న సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో తప్పుల సవరణ, అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్వోలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది రమేష్, సుజాత, బీఎల్వోలు రాజు, అనిల్, అలాగే స్థానిక నాయకులు శంకర్, మహేందర్ పాల్గొన్నారు.

## గడ్డంపల్లి గ్రామంలో ఆదర్శ సేవా కార్యక్రమాలు



**తెలకపల్లి, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రతి నెల మొదటి ఆదివారం భాగంగా గడ్డంపల్లి గ్రామంలో సర్పంచ్ వెన్నెల శేఖర్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రామాలయ దేవస్థానం, చెన్నకేశవ స్వామి, ఈదమ్మా తల్లి, ఎల్లమ్మ తల్లి దేవాలయాల పరిసరాలను శుభ్రపరచడం, అంబేద్కర్ విగ్రహం వద్ద మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు గ్రామ ప్రజల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాయి. "పరిశుభ్రమైన దేవాలయం పవిత్రమైన గ్రామం, పచ్చని మొక్కలు ఆరోగ్యకరమైన భవిష్యత్తు" అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ గ్రామ అభివృద్ధికి ఆదర్శంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామయ్య, గోపాల్, సత్యనారాయణ, యువకులు అనిల్, రాజు, మహేష్, మహిళా సంఘ సభ్యులు లక్ష్మి, సుజాత, రాధిక, అలాగే స్థానిక నాయకులు శంకర్, మహేందర్ పాల్గొన్నారు.

## చిట్యాల్ మండలం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



**నల్లగొండ, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిట్యాల్ మండలం పెద్దాకపర్తి సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కారణాలపై సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, సురక్షిత దూరం పాటించకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు దారితీస్తాయని, ప్రజలు రహదారి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది.

## పెరిగిన కోడి గుడ్ల ధరలు.. సామాన్యుడిపై భారం



**ఆమనగల్లు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కోడి గుడ్ల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతోంది. తెలంగాణలో ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్లో ఒక్క గుడ్డు ధర సుమారు రూ.6.50 ఉండగా, డజన్ రూ.78, 30 గుడ్ల ట్రే రూ.195గా ఉంది. అయితే స్థానిక రిటైల్ మార్కెట్లలో ఒక్కో గుడ్డు రూ.8 నుంచి రూ.10 వరకు, డజన్ రూ.96 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. దాణా ధరలు, రవాణా ఖర్చులు, కోళ్ల పెంపక వ్యయం పెరగడంతో పాటు మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. గుడ్లు తక్కువ ధరలో అధిక పోషక విలువలు అందించే ఆహారంగా పేరొందాయి. ముఖ్యంగా పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, విద్యార్థుల ఆహారంలో గుడ్లకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే ధరలు పెరగడంతో అనేక కుటుంబాలు గుడ్ల వినియోగాన్ని తగ్గిస్తున్నాయి. మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం పర్యవేక్షించి ధరలు అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. ఉత్పత్తి పెరిగి సరఫరా మెరుగుపడితే రానున్న రోజుల్లో గుడ్ల ధరలు కొంత మేర తగ్గే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## జంగారెడ్డిపల్లిలో ఇంటింటి ఓటరు సర్వే



**ఆమనగల్లు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ 4వ వార్డు జంగారెడ్డిపల్లి పరిధిలోని బూత్ నంబర్-204లో ఆదివారం బీఎల్ఓలు, బీఎల్ఏలు ఇంటింటి ఓటరు సర్వే నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు జాబితాలోని పేర్లు, చిరునామాలు, కుటుంబ వివరాలను పరిశీలించారు. అర్హత సాధించిన కొత్త ఓటర్ల వివరాలను నమోదు చేయడంతో పాటు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను కూడా సేకరించారు. ఓటరు జాబితాలో అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించిన సూచనలు అందించారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు సక్రమంగా నమోదై ఉండేలా చూసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ దుడ్డు ఆంజనేయులు యాదవ్, ఎండీ ఖాదర్, బీఎల్ఓలు సికిందర్, దశరథ్, బీఎల్ఏలు జంతుక అల్లాజీ, ఎండీ ముజాహిద్, జంతుక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల వైద్యానికి ప్రభుత్వ అండ

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుపేద కుటుంబాల వైద్య అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అండగా నిలుస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని పేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యం పొందాలని సూచించారు. ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, పేదల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 70వ బూత్‌లో ఎస్ఐఆర్ సర్వే పరిశీలన



**నందికొట్కూరు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం భాగంగా నందికొట్కూరు పట్టణంలోని 70వ బూత్, 2వ సచివాలయం పరిధిలో ఆదివారం సర్వే జరిగింది. బీఎల్వో మాధవస్వామి, వైఎస్ఆర్సీపి టౌన్ వైస్ సెక్రటరీ ఆయిల్ షఫీ ఇంటింటికీ వెళ్లి ఓటర్ వివరాలను పరిశీలిస్తూ, అవసరమైన సమాచారాన్ని ప్రజలకు తెలియజేశారు. ఈ ప్రక్రియను నందికొట్కూరు మండల తహశీల్దార్ శ్రీనివాసరావు ప్రత్యక్షంగా పరిశీలించారు.

# గ్రామీణులకు వరంగా ఉచిత కంటి వైద్య శిబిరం

- రెండ్రోజుల్లో 1,200 మందికి వైద్య సేవలు..
- 46 మంది శస్త్రచికిత్సలకు ఎంపిక




**ఆమనగల్లు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన కంటి వైద్యాన్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ప్రముఖ శంకర నేత్రాలయ చెన్నై వైద్య నిపుణుల సహకారంతో తలకొండపల్లిలో నిర్వహిస్తున్న సుంకిరెడ్డి మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. రెండో రోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి హాజరై వైద్య సేవలు పొందారు. ఆదివారం శిబిరాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సందర్శించి వైద్య బృందంతో మాట్లాడి సేవల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కంటి చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఐక్యత ఆరోగ్య భరోసా కార్యక్రమం ద్వారా ఈ ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు, శుక్లాల శస్త్రచికిత్సలు కూడా అందిస్తున్నామని చెప్పారు. తలకొండపల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఈ నెల 12వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. రెండో రోజు దాదాపు 600 మందికిపైగా శిబిరాన్ని సందర్శించగా, 280 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, 180 మందికి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు. అలాగే 25 మందిని కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఇప్పటివరకు రెండు రోజుల వ్యవధిలో మొత్తం 1,200 మందికిపైగా శిబిరాన్ని సందర్శించగా, 600 మందికిపైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, 350 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 46 మంది రోగులను శుక్లాల శస్త్రచికిత్స కోసం ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. శంకర నేత్రాలయ చెన్నై వైద్య నిపుణుల సేవలతో కొనసాగుతున్న ఈ శిబిరాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకర్ నాయక్, కళ్యాణ్ నాయక్, ఉపసర్పంచ్‌లు భాస్కర్, దేరంగుల అనిత విజయ్, రమేష్ యాదవ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ దేవాలయ భూమి పరిరక్షణకు దళిత కుటుంబాల నిరసన




**ఆమనగల్లు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు నవచైతన్య కాలనీలోని సందబావి సమీప గ్రామకంఠ భూమిలో తరాలుగా దళిత కుటుంబాలు ఆరాధిస్తున్న రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని కొందరు భూకబ్జాదారులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఆదివారం దళిత కుటుంబాలు దేవాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గ్రామకంఠ భూమిలో ఉన్న దేవాలయాన్ని పరిరక్షించాలని, ఆ స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నాలను వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కొల్లూరు కృష్ణాదేవి ఉద్దేశపూర్వకంగా 12 మంది దళిత కుటుంబాలపై అక్రమ కేసులు నమోదు చేయించి ఏడాది కాలంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో గ్రామ ప్రజలకు తాగునీటి వనరుగా ఉపయోగపడిన సందబావి ఉన్న ఈ గ్రామకంఠ భూమిని కాపాడేందుకు న్యాయపరంగా ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రకటించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ ఆమనగల్ మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లండం జంగయ్య, కందుకూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జంతుక శంకర్ మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని, హిందూ సంప్రదాయంలో ఆరాధించే ఎల్లమ్మ దేవాలయ భూములను కబ్జా చేసే కుట్రలో భాగంగానే దళితులపై అక్రమ కేసులు నమోదు చేయడం దురదృష్టకరమని అన్నారు. దళిత వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు వస్పుల సురేష్, కోశాధికారి కొమ్ము శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి మీసాల రమేష్, జాయింట్ సెక్రటరీ అప్సర్, వస్పుల శేఖర్, జంతుక కిరణ్, శివ, కృష్ణ, శేఖర్, రాములమ్మ, వెంకటమ్మ, ఎల్లమ్మ, రాంచంద్రమ్మ, యాదమ్మ, బాల్‌రాం, పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు అండగా ఉచిత పోలీస్ శిక్షణ




**ఆమనగల్లు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో చేయూతనందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన 70 రోజుల ఉచిత పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణ తరగతులు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, టాస్క్ (టాటాఖ) సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులను అభినందించిన ఆయన రాబోయే పోలీస్ నియామక పరీక్షల్లో విజయాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, ప్రణాళికాబద్ధమైన చదువు, శారీరక దృఢత్వం, సమయపాలన విజయానికి కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశమని అన్నారు. అపజయాలను చూసి వెనుకడుగు వేయకుండా ప్రతి ప్రయత్నాన్ని విజయానికి మార్గంగా మలుచుకోవాలని యువతకు సూచించారు. భవిష్యత్తులో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలోని "స్కిల్ ఫ్యాక్టరీ" ద్వారా ఏఐ, ఐటీ, భాషా నైపుణ్యాలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి కల్వకుర్తి నియోజకవర్గ యువతకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. "ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగి" లక్ష్యంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. శిక్షణ పొందిన అభ్యర్థులు మాట్లాడుతూ ఉచితంగా నాణ్యమైన శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకుడు విశ్వనాథ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, మాజీ సర్పంచ్ శ్రీరాములు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితుడికి అండగా నిలిచిన పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం రాఘయిపల్లి గ్రామానికి చెందిన సామ శ్రీశైలం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘసేవకుడు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకుడు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము మానవతా దృక్పథంతో స్పందించి వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆయన శ్రీశైలం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సలకు ఎలాంటి ఆటంకం కలగకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పాపిశెట్టి రాము అందించిన ఆర్థిక సహాయంపై బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండే ఆయన సేవలు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీను నాయక్, బర్కం గణేష్, గిరి మహేష్, సామ శ్రీహరి, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన గుజ్జుల మహేష్



**ఆమనగల్లు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 20 సంవత్సరాల రాజకీయ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో శనివారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ మాజీ తలకొండపల్లి మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని గుజ్జుల మహేష్ కొనియాడారు. జడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగి తెలంగాణ అభివృద్ధికి కృషి చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు గర్వకారణమని అన్నారు. మిడ్జిల్ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజకీయ ప్రస్థానం మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశంలో మాండ్ర, ఎమ్మెల్యే జయసూర్య



**నందికొట్కూరు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు మండలం నాగటూరు గ్రామంలో టిడిపి నాయకుడు మల్లికార్జున్ రెడ్డి ఆహ్వానం మేరకు జరిగిన నూతన గృహప్రవేశ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మల్లికార్జున్ రెడ్డి కుటుంబానికి ధనధాన్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆశీర్వదించారు. అనంతరం కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, హరి సర్వోత్తమ్ రెడ్డి, సత్యం రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, జయరాం రెడ్డి, ఓబుల్ రెడ్డి, హరీష్ రెడ్డి, అలాగే స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐ సురేష్ రెడ్డి మృతి



**పాణ్యం, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కర్నూలు నుంచి నంద్యాల వైపు వస్తున్న కారు టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ రూరల్ ఏఎస్ఐ సురేష్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, వారిని నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. పాణ్యం పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# శ్రీశైలం లో కాలభైరవాష్టకం నృత్య ప్రదర్శన

**శ్రీశైలం, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం నిత్యకళారాధన వేదికపై హైదరాబాదు శ్రీహరి ఆర్ట్స్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన చేసింది. ఈ సందర్భంగా విజయమాధవి, అభిన్య, సింధుజ, మేఘన, తేజస్విని, నిత్యశ్రీలక్ష్మి, వైదసంహిత, భవిష్య, నందిని, నిత్యశ్రీ తదితర కళాకారులు భో శంభో, వినాయకకౌత్వం, అయిగిరినందిని, కాలభైరవాష్టకం, శివతాండవం, శివస్తుతి వంటి గీతాలకు అద్భుతమైన నృత్య ప్రదర్శనలు అందించారు. నిత్యకళారాధనలో ప్రతి రోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రాచీన కళల పరిరక్షణకు శ్రీశైలం దేవస్థానం కృషి చేస్తోంది.




# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జాతి పండుగగా జరుపుకోవాలి

**- రాగల్ల ఉపేందర్ మాదిగ**



**ఆమనగల్లు, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ (వీఠాలా) ఆవిర్భావ దినోత్సవాన్ని మాదిగ జాతి పండుగగా ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. అదివారం ఆమనగల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం మాదిగ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగిన ఉద్యమ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని, ఆ విజయాన్ని ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగరవేసి ఘనంగా జరుపుకోవాలని అన్నారు. అదే రోజు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినం కూడా కావడంతో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలుతో మాదిగలకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 9 శాతం రిజర్వేషన్ ప్రయోజనాలను వినియోగించుకొని ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన సామాజిక-ఆర్థిక సర్వేలో మాదిగలు అక్షరాస్యతలో వెనుకబడిన వర్గంగా గుర్తించబడ్డారని పేర్కొంటూ, విద్య ద్వారానే పేదరికం, వెనుకబాటుతనాన్ని అధిగమించవచ్చని అన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా మాదిగలు ఐక్యంగా ముందుకు సాగి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితులను అధిగమించి విద్యను కొనసాగించాలని యువతకు పిలుపునిచ్చారు. మూడు దశాబ్దాల ఉద్యమ ఫలితంగా సాధించిన వర్గీకరణ ప్రయోజనాలను అందిపుచ్చుకొని ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో మాదిగ యువత ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ, మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం, ఉపాధ్యక్షుడు శ్రీరామ్, రాకేష్, వంశీ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# 100 రోజులు.. 185 కేసులు



తినే అన్నంలో కల్తీ.. తాగే పాలలో కల్తీ.. చివరకు పసిబిడ్డలకు పట్టే పాలపొడిలోనూ ప్రాణాంతక పదార్థాలు.. ఇది ఏదో సినిమా డైలాగ్ కాదు.. నగరంలో హెచ్ ఫాస్ట్ పోలీసుల దాడుల్లో వెలుగుచూస్తున్న సంచలనాత్మక విషయాలు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న కల్తీ ముఠాల ఆటకట్టించేందుకు కమిషనరేట్ పరిధిలో హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్(హెచ్-ఫాస్ట్)ను ఏర్పాటు చేసి వంద రోజులైంది ఈ ఏడాది మార్చి 19న ఈ ప్రత్యేక విభాగం నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రత్యేక దృష్టితో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఫుడ్‌సేఫ్టీ, జీహెచ్ఎంసీ, వెటర్నరీ విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆకస్మిక తనిఖీలు, నిరంతర దాడులతో నగరంలో ఆహార కల్తీని అరికట్టేందుకు ఈ విభాగం ప్రయత్నిస్తోంది. టాస్క్‌ఫోర్స్ డీసీపీ నేతృత్వంలో 36 మంది అధికారులు, సిబ్బందితో నిరంతరం హెచ్ ఫాస్ట్ విభాగం పనిచేస్తోంది.

**కల్తీ మాఫియాపై పోలీసుల దృష్టి..**

మూడునెలలుగా నగరంలో వెలుగు చూసిన కల్తీ మాఫియా ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. అల్లం వెల్లుల్లి పేస్ట్ మొదలుకొని తాగే టీ పౌడర్ వరకు నెయ్యితో సహ కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లు ప్రతిఒక్క వస్తువు కల్తీమయం కావడంతో సిటీ పోలీసులు ఈ మాఫియాపై దృష్టి పెట్టారు. వంద రోజులుగా సిటీ పోలీసులు నగరంలో పలు చోట్ల చేసిన దాడుల్లో 121.87 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను సీజ్ చేశామని సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. హెచ్‌ఫాస్ట్ బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో వివిధ జోన్ల పరిధిలో 185 కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జోన్ల వారీగా వివరాలు పరిశీలిస్తే అత్యధికంగా రాజేంద్రనగర్ జోన్‌లో 55 కేసులు .. నమోదు కాగా, గోల్కొండలో 44, సికింద్రాబాద్‌లో 35, చార్మినార్‌లో 21, శంషాబాద్‌లో 13, ఖైరతాబాద్ జోన్‌లో 5 కేసులు నమోదైనట్లు తెలిపారు. పసిపిల్లలకు తినిపించే బిస్కెట్లు, ఐస్‌క్రీమ్‌లతో సహ వంటింట్లో వాడే టీ పొడి, పాలు , పెరుగు తదితర వస్తువులన్నీ కల్తీమయమవుతున్నట్లుగా గుర్తించామని సజ్జనార్ తెలిపారు. పోలీసు చర్యలతో పాటు జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు తదుపరి చర్యల కోసం 247 కేసులు అప్పగించారు.

**కల్తీ ఎలా జరుగుతున్నదంటే ..!**

కల్తీ పదార్థాల్లో వారు కల్తీ చేస్తున్న విధానం చూసి పోలీసులే ఆశ్చర్యపోయారు. అల్లం వెల్లుల్లి పేస్ట్‌లో వెల్లుల్లి పొట్టు, సింథటిక్ రంగులు, ప్రమాదకరమైన శాంటిక్ , ఎసిటిక్ యాసిడ్లను కలుపుతున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో నిల్వ ఉంచిన కుళ్లిపోయిన చికెన్, మటన్‌ను రసాయనాలతో కడిగి తాజాగా చూపిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. పామాయిల్, ఇతర చౌక నూనెలతో కలిపి నెయ్యిగా చెలామణీ చేస్తున్నారని, చెక్కపొట్టు టీ పొడిగా మార్చి సామాన్యుడి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని సజ్జనార్ పేర్కొన్నారు. గడువు ముగిసిన డ్రై ఫ్రూట్స్, సమోసాలు, పండుగ సమయాల్లో విరివిగా వాడే పేణీల్లో సైతం విషపూరిత రసాయనాలు వాడుతున్నారని, పన్నీరుతో సహ ప్రతి ఒక్క వస్తువు కల్తీ కావడంతో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదమున్నట్లుగా గుర్తించామని పేర్కొన్నారు. ఈ మేరకు తాము ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు ఫుడ్ సేఫ్టీ కోసం పనిచేస్తున్నాయని, అందులో కల్తీ వస్తువులను గుర్తించడం కోసం స్థానిక పోలీసు సిబ్బంది సహకారంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. బ్రాండెడ్ వస్తువుల కంటే తక్కువ ధరకు వస్తుండడంతో ప్రజలు ఆశకు పోయి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారని సజ్జనార్ తెలిపారు. ఇప్పుడు పోలీసుల ఇస్తున్న ఈ అలర్ట్‌ను గమనించి ప్రతి పౌరుడు కచ్చితంగా కల్తీ మాఫియా అంతం కోసం సహకరించి ముందుకు రావాలని ప్రజలను కోరారు.

# చెల్లింపులతోనే వైద్య సేవలు

సనత్‌నగర్ టిమ్స్‌కు మెంటర్ సెంటర్‌గా నిమ్స్‌ను కేటాయించారు. అంటే నిమ్స్ పర్యవేక్షణలో సనత్‌నగర్ టిమ్స్ కార్యకలాపాలు సాగనున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల జారీచేసిన ఉద్యోగాల నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను నిమ్స్ నుంచి వెలువడినట్లు అధికారులు తెలిపారు. టిమ్స్‌కు సంబంధించిన అన్ని కార్యకలాపాలు నిమ్స్ మార్గదర్శకాల ప్రకారం జరగనున్నట్లు సమాచారం. అంతే కాకుండా ఉస్మానియా, గాంధీ తదితర ప్రభుత్వ దవాఖానల్లా సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవలు పూర్తి ఉచితంగా ఉండవని సమాచారం. ఈ హాస్పిటల్‌లో కూడా నిమ్స్ తరహా చెల్లింపుల ద్వారానే వైద్యసేవలు అందించనున్నట్లు అధికారులు అనధికారికంగా చెబుతున్నారు. అయితే ఆరోగ్యశ్రీ, ఎంప్లాయిస్ హెల్త్ కార్డు, జర్నలిస్టుల హెల్త్ కార్డులు మినహా ఇతర అన్ని రకాల ప్రజలకు ఓపీ, ఐపీ, శస్త్రచికిత్సలు తదితర వైద్య సేవలను చెల్లింపుల ద్వారానే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం.




**పేదలకు వైద్యసేవలు అందని ద్రాక్షేనా?**

నిరుపేద రోగులకు సూపర్ స్పెషాలిటీ సేవలు మళ్లీ అందని ద్రాక్షగానే మిగిలిపోనున్నట్లు ప్రజలు వాపోతున్నారు. సాధారణంగా సూపర్ స్పెషాలిటీ వైద్యం ఖర్చుతో కూడుకున్నది. వైద్యపరీక్షలు, శస్త్రచికిత్స, మందులు ఇలా ప్రతీది ఖరీదైనదే. అయితే ప్రభుత్వ రంగ పరిధిలో నడిచే నిమ్స్, అందుబాటులోకి రానున్న టిమ్స్‌లో ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ తదితర స్కీముల కింద అందించే వైద్యసేవలు పూర్తి ఉచితంగా అందడం లేదని, వాటికి పరిమితులు విధించడంతో నిర్ణీత పరిమితి దాటితే మిగిలిన బిల్లులు చేతిద్వారా చెల్లించాల్సి వస్తోందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రకాల వైద్య సేవలు ఆరోగ్యశ్రీ పరిధిలోకి రావడం లేదని, దీంతో ఆర్థిక భారం తప్పడంలేదంటున్నారు రోగులు. అంతే కాకుండా ఈ దవాఖానల్లో చాలా వరకు మందులన్నీ బయటి నుంచే తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. అదే గాంధీ, ఉస్మానియా తరహా పూర్తిస్థాయి ప్రభుత్వ దవాఖానలో అయితే అన్ని వర్గాల ప్రజలకు పైసా ఖర్చు లేకుండా పూర్తి ఉచితంగా వైద్యం అందుతుందని జనం అభిప్రాయపడుతున్నారు.

## ఎడిటోరియల్

# ఇక సర్కారీ మెట్రో..


హైదరాబాద్‌లో మెట్రో రైలు సేవలను విస్తరించడంలో భాగంగా మొదటి దశ మెట్రోను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులతో కీలక చర్చలు జరిపారు మెట్రో రైలు ఫేజ్ 1లో తమకున్న మొత్తం వాటాను రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో హెూల్ సెల్ ఇండియా హైదరాబాద్ దాదాపు 163 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరించేందుకు ఎల్ అండ్ టికి మెట్రోపై ప్రస్తుతం ఉన్న దాదాపు రూ. 13,000 కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించనుంది. దీంతో పాటు తమ కంపెనీ ఈక్విటీ విలువకు సుమారు రూ. రూ.2,000 కోట్లు వన్-టైం చెల్లింపులను చేపట్టాలని ఎల్ అండ్ టి కంపెనీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ చెల్లింపు పూర్తి చేసిన వెంటనే మెట్రో మొదటి దశ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోకి వస్తుంది. 2014లో దేశంలో మెట్రో రైలు నెట్‌వర్క్‌లో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్, ప్రస్తుతం తొమ్మిదవ స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ సిటీలో ట్రాఫిక్ రద్దీ, ప్రజా రవాణా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మెట్రోను విస్తరించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఫేజ్ 2ఏ, 2బి విస్తరణలో భాగంగా ఎనిమిది కొత్త మెట్రో లైన్ల ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. దాదాపు 163 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన మెట్రో విస్తరణ ప్రతిపాదనలన్నీ కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే పలు మార్లు సమావేశాలు నిర్వహించిన కేంద్రం ప్రైవేటు భాగస్వామ్యంతో నడుస్తున్న ఫేజ్ 1 మెట్రోకు, ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఫేజ్ 2 విస్తరణకు సంయుక్త కార్యాచరణ అవసరమని సూచించింది. అందుకు వీలుగా ఒప్పందం కావాలని కేంద్రం స్పష్టం చేసింది. ఫేజ్ 2లో కూడా ఎల్ అండ్ టి భాగస్వామ్యం ఉండాల్సి ఉంటుందని కేంద్రం సూచించింది. కేంద్రం అభ్యంతరాల నేపథ్యంలో నెలకొన్న ప్రతిష్టంభనను అధిగమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆర్థిక ఒప్పందాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ, మెట్రో ఫేజ్ 2లోనూ ఎల్ అండ్ టి భాగస్వామ్యం పంచుకుంటే బాగుంటుందని, రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగినంత ప్రాధాన్యతనిస్తుందని సిఎం తెలిపారు. ఫేజ్ 1, ఫేజ్ 2 కారిడార్ల మధ్య సంయుక్త కార్యాచరణకు కచ్చితమైన ఒప్పందం అవసరమని ముఖ్యమంత్రి సూచించారు. ఈ ఒప్పందం కుదిరితేనే విస్తరించే రైలు కార్యకలాపాలు సజావుగా సాగుతాయని, ఆదాయ వ్యయాల భాగస్వామ్యంలో స్పష్టత ఉంటుందని సిఎం అన్నారు. రవాణా సంబంధిత వ్యాపారం నుంచి కంపెనీ తప్పుకున్నందు వల్ల కంపెనీ ఈక్విటీ భాగస్వామిగా ఉండలేదని ఎల్ అండ్ టి సీఎండీ అన్నారు. 2002 జులై 22న కుదిరిన రాయితీ ఒప్పందం ప్రకారం ప్రభుత్వం అంగీకరించిన రూ. 3,000 కోట్ల వడ్డీ లేని రుణంలో రూ.2,100 కోట్లు బకాయి ఉందని ఆయన గుర్తు చేశారు. చర్చల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్ 1 మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది. ఆర్థిక ఒప్పందాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో మెట్రో రెండో దశ విస్తరణ వేగవంతమవుతుందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు, ఆమోదం తొందరగా వచ్చే అవకాశముందని సిఎం రేవంత్ అభిప్రాయపడ్డారు

## కమలంలో లీక వీరులు ఎవరు...

"మోదీతో విందులో జరిగిన చర్చల్ని బయటపెట్టిన వారెవరు?. మోదీ బయటకు చెప్పవద్దనిచెప్పారు?. బయటకు చెప్పిన వారిపై చర్యలు తీసుకుంటాం"..అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియా చిట్ చాట్ లో ఆవేశపడ్డారు. ఆయన అలా అన్నారు కానీ ఆ సమావేశంలో మోదీ ఎం చెప్పారో ఆయన కూడా ఈ మీడియా చిట్ చాట్ లో చెప్పారు. ఒడిషాలో బలమైన నేతలు లేరు కానీ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యాయని అంతర్గత రాజకీయాలు చేసుకుంటున్నారు. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యాయని అంతర్గత రాజకీయాలు చేసుకుంటున్నారు. తెలంగాణ బీజేపీ రాను రాను కుంచించించుకుపోతోంది. దానికి పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ తో లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్న చోట ఆ పార్టీకి మంచి ఫలితాలు వస్తున్నాయి. కానీ తమ పార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్న చోట కూడా భారీ విజయాలు దక్కించుకోలేకపోతోంది. ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారు. వారంతా మంచి మెజార్టీలతో గెలిచారు. కానీ పంచాయతీ ఎన్నికలను పట్టించుకోవడం లేదు. ఈటల రాజేందర్ మల్కాజిగిరి కన్నా హుజూరాబాద్ పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఇతర ఎంపీలూ అంతే. ఎవరికి పదవి ఇస్తే ఎవరు అసంతృప్తికి గురవుతారోనన్న ఉద్దేశంతో అందర్నీసమానంగా ఉంచుతూ.. ప్రధాన పదవులకు పెద్దగా పోటీ పడని రామచంద్రరావును అధ్యక్షుడిగా నియమించారు. కానీ ఈ నియామకాన్ని బీజేపీ నేతలు వేరేగా తీసుకున్నారు. అసలు పని చేయడం మానేసారు. కొంత మంది అడ్వాంటేజ్ గా తీసుకున్నారు. తెలంగాణ బీజేపీలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ తో పాటు డీకే అరుణ, రఘునందన్ రావు లాంటి వాళ్లు ఉన్నారు. అందరూ ఎప్పుడూ ఒక్క మాట మీద లేరు. ఎవరి రాజకీయాలు వారు చేస్తున్నారు. వీరిలో ఎవరికైనా అధ్యక్ష పదవి వచ్చి ఉంటే పరిస్థితి ఇంకా ఘోరంగా ఉండేది. ఇప్పుడు రామచంద్రరావు చెప్పిన మాట వినరు. పార్టీ తరపున పోరాటం చేయరు. దీంతో హైకమాండ్ రామచంద్రరావు నియామకంలో చేసిన ప్రయోగం రివర్స్ అయినట్లయింది. బండి సంజయ్ నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ పరిస్థితి మెరుగ్గానే ఉండేది. కానీ ఆయన ఎదుగుదల చాలా మందికి నచ్చలేదు. అందుకే నియంత్రించారు. చివరికి ఇప్పుడు అటూ ఇటూ కాకుండా అయిపోయింది. అటు ఈటలను ప్రోత్సహిస్తే బండి సంజయ్ ఒప్పుకోరు. బండి సంజయ్ ను ప్రోత్సహిస్తే ఈటల, కిషన్ రెడ్డి అంగీకరించరు. పార్టీ నేతల మధ్య ఏ మాత్రం సరిపడని ఈ రాజకీయాన్ని మోదీ ఎంతో కాలం సహించే అవకాశం లేదు. పార్టీ పరిస్థితి మెరుగుపడకపోతే ఆయన కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విషయాలను బయటపెట్టింది ఎవరనేది మిస్టరీ.. మోదీతో తెలంగాణ ఎంపీల భేటీకి సంబంధించిన వివరాలు బయటకు రావడంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సీరియస్ అయ్యారు

# ఆ పదిమందిని బిఆర్ఎస్ ఆహ్వానించాలి !

**ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా..కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు.**



కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే. ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒకమాట బయట మరోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి . హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకు పోజులిస్తుంటారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందని అంటున్నారు. ఒక్క మోదీయే కాదు..దేశమంతా ఇలాగే తగులబడింది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడ దూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు

బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి. అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడింది. ఆయనకు జర్మనీ పౌరసత్వం ఉందని తెలిసినా కులగజ్జితో ఎమ్మెల్యేను చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సకల సౌఖ్యాలు అనుభవించారు. దీనిపై ఆనాడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కెసిఆర్ స్పందించలేదు. ఈ వ్యవహారం కోర్టుల్లో తేలడానికి పదేళ్లు పట్టింది. అందుకే పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై వాదించే అధికారం బిఆర్ఎస్ నైతికంగా కోల్పోయింది. రాజకీయాల్లో కఠిన చట్టాలను తుంగలో తొక్కుతున్నదే ప్రజాప్రతినిధులు అన్నది మరచిపోరాదు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపుదారులను విచారించి వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యాన్ని ఆక్షేపించారు. స్పీకర్ సాగదీత ధోరణిపై సుప్రీంకోర్టు ధర్మాసనం పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫిరాయింపుపై మూడు నెలల్లో తేల్చాలని తొలుత జూలై 31న ఆదేశించింది. అక్టోబర్ 21తో గడువు ముగిసినా తేల్చక పోవడంపై కోర్టు సీరియస్ అయ్యింది. నవంబర్ 17న మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని, లేదా నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలను కుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిజానికి సుప్రీం కనుక తన తీర్పును స్పీకర్ కోర్టులోకి నెట్టకుండా నేరుగా నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేది. పక్కా అఫిడవిట్లు, ఫొటోలు, బహిరంగ ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, అనేక నెలలుగా కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని స్పష్టంగా నివేదించినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ సాంకేతికంగా ఇప్పటికీ బీఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొనడంపై పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో వెలువడిన నిర్ణయం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. తమకు మాత్రం వ్యతిరేకమైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం కాదు...ఎప్పుడూ ఒకేలా ఉండాలి. దీనికి భిన్నంగా ఏదో జరుగుతుందని కూడా ఎవరూ అనుకోవద్దు. ప్రజాజీవితంలో నైతిక విలువలు పూర్తిగా లుప్తమైన స్థితిలో ఇలాంటి అనైతికత ఓడుతుందని నైతికత గెలుస్తుందనీ ఎదురుచూడటం అత్యాశే అవుతుంది.

## గన్నవరంలో వంశీకి కలిసొచ్చేనా

గన్నవరం రాజకీయాలు మళ్లీ గరం గరంగా మారనున్నాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తిరిగి గన్నవరం పాలిటిక్స్ లో యాక్టివ్ అయ్యారు. దాదాపు రెండేళ్ల పాటు గన్నవరం రాజకీయాలకు దూరంగా ఉన్న వల్లభనేని వంశీ తాజాగా ఇప్పుడు తిరిగి తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వల్లభనేని వంశీ తిరిగి యాక్టివ్ కావడంతో అక్కడ వైసీపీ కార్యక్రమాలు కూడా ఊపందుకున్నాయి. గన్నవరం నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వల్లభనేని వంశీ గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తర్వాత కొన్ని నెలల పాటు జైల్లో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వల్లభనేని వంశీ రూపు రేఖలు కూడా జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత మారిపోయాయి. ఇప్పటికీ అదే రకంగా వల్లభనేని వంశీ మెయిన్ టెయిన్ చేస్తున్నారు. గతంలో యువకుడిగా కనిపిస్తూ, జుట్టుకు రంగు వేసుకుని కనిపించే వల్లభనేని వంశీ గత కొద్ది రోజుల నుంచి మాత్రం తెల్లజుట్టు, బక్కపలచగానే ఉన్నారు. అది కేవలం సెంటిమెంట్ తోనే వంశీ జనంలోకి వెళ్లి సింపతీని పొందాలనుకుంటున్నట్లుంది. అందుకే ఆయన తన రూపు రేఖలను మార్చుకునే ప్రయత్నం చేయడం లేదు. వల్లభనేని వంశీని గతంలో , ఇప్పుడు చూసిన వారికి పాపం.. అనిపించేలా వంశీ ఉండటం ఆయనకు కలసి వచ్చే అంశమని చెబుతున్నారు. జైల్లో 140 రోజుల పాటు ఉన్న వల్లభనేని వంశీ తెల్ల జుట్టుతో పాటు అనేక ఆరోగ్య పరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వచ్చే ఎన్నికల వరకూ ఇదే రకంగా మెయిన్ టెయిన్ చేసి తిరిగి గెలుపొందేలా ప్లాన్ చేసుకున్నారని తెలిసింది. వల్లభనేని వంశీ ఇటీవల వరసగా అనేక వివాహ వేడుకలకు హాజరయ్యారు. అక్కడ టీడీపీ నేతలను కూడా పలుకరించడం, ఆత్మీయంగా దగ్గరకు తీసుకోవడం చర్చనీయాంశమైంది. వివాహ వేడుకలలో మాత్రమే కాకుండా అనేక కార్యక్రమాలకు కూడా ఆయన హాజరవుతున్నారు. గన్నవరం నియోజకవర్గంలో వల్లభనేని వంశీ విస్తృతంగా పర్యటిస్తున్నారు. వైసీపీ కార్యకర్తలకు ధైర్యం చెబుతున్నారు. తాను ఎక్కడకూ వెళ్లనని, ఇక్కడే ఉండి రాజకీయాలను కొనసాగిస్తానని చెబుతున్నారు. తనపై పదకొండు కేసులు నమోదయ్యాయని, ఇంతకు మించి ఏం చేస్తారన్న ధీమా వల్లభనేని వంశీలో స్పష్టంగా కనిపిస్తుంది.

## పరకామణి, కల్తీ నెయ్యి, పట్టు శాలువాలు

ఏడుకొండల వాడు, వడ్డీకాసుల వాడు..కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో..నిత్యం ఏదో ఒక ఇష్యూ సంచలనం సృష్టిస్తూనే ఉంది. ఇప్పటికే కల్తీ నెయ్యి, పరకామణి చోరీ ఎపిసోడ్ కొండంత వివాదంగా ఉండగా..ఈ మధ్యే పట్టు శాలువాల స్కామ్ అంటూ దుమారం లేచింది. ఈ ఇష్యూ అలా చల్లారిందో లేదో..ఇప్పుడు ఇంకో వివాదం వెలుగులోకి వచ్చింది. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ విమాన గోపురం బంగారు తాపడం పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. గోవిందరాజస్వామి ఆలయంలో 50 కిలోల బంగారం మాయం చేశారన్న ప్రచారం సెన్సేషనల్ అవుతోంది. విమాన గోపురం బంగారం తాపడం పనులకు గత ప్రభుత్వం 100 కిలోల బంగారం కేటాయించగా..అందులో 50 కేజీల గోల్డ్‌ను మాయం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. 9 లేయర్లతో బంగారం తాపడం వేయాల్సి ఉండగా 2 లేయర్లే వేశారన్న టాక్ వినిపిస్తోంది. బంగారం తాపడం పనులు అసలు కాంట్రాక్టర్ కాకుండా సబ్ కాంట్రాక్టర్ నిర్వహించారన్న చర్చ జరుగుతోంది. ఆలయ గోపురంపై అప్పట్లో 30పైగా విగ్రహాలు ధ్వంసం చేసి బంగారం తాపడం పనులు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అవకతవకలపై చాలా సీక్రెట్‌గా విజిలెన్స్ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. లేటెస్ట్ వ్యవహారంపై మరోసారి తిరుమల శ్రీవారి సెంట్రిక్‌గా తీవ్ర దుమారం నడుస్తోంది. గోవిందరాజస్వామి ఆలయ గోపుర తాపడం కోసం కేటాయించిన బంగారంలో గోల్‌మాల్ జరిగిందన్న ప్రచారం పొలిటికల్ కాంట్రవర్సీ అవుతోంది. ఇప్పటికే కల్తీ నెయ్యి ఎపిసోడ్ నేషనల్ టాపిక్ అయింది. దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసి..హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చేసింది. ఆ తర్వాత పాత ఇష్యూ పరకామణి చోరీ కేసు కలకలం సృష్టించింది. ఫిర్యాదుదారుడు, సాక్షిగా ఉన్న ఆఫీసర్ అనుమానాస్పద మృతి చెందడంతో కూటమి వర్సెస్ వైసీపీ డైలాగ్ వార్‌కు దారితీసింది. ఇక శ్రీవారి పట్టువస్త్రాల స్కామ్ కూడా హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు గోవిందరాజస్వామి ఆలయ తాపడం వ్యవహారంతో మరోసారి తిరుమల చుట్టే చర్చ జరుగుతోంది. ఏడాది కాలంలోనే నాలుగు అంశాలు శ్రీవారి భక్తుల మనసును గాయపరిచాయి. కల్తీ నెయ్యి, పరకామణి కేసులో వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ ఈవోలు అలిగేషన్స్ ఫేస్ చేస్తున్నారు. పట్టు శాలువాల వ్యవహారంలో విజిలెన్స్ దర్యాప్తు ఉత్కంఠ రేపుతోంది. గోవిందరాజ స్వామి ఆలయ గోపురం తాపడం తయారీలో..50 కిలోల బంగారం చోరీ అయినట్లు ప్రచారం జరుగుతుండటం సంచలనం సృష్టిస్తోంది.